మళ్లీ ఇబ్బందులేనా..!

- ప్రమాదకరంగా అర్కండ్ల లోలెవల్‌బ్రిడ్జి
- వర్షాకాలంలో బ్రిడ్జి పైనుంచి వరద ప్రవాహం
- వాగు దాటుతుండగా నీటిలో కొట్టుకుపోతున్న ప్రజలు
- హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించేదెప్పుడో..?
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


అర్కండ్లవాగుపై లోలెవల్‌బ్రిడ్జి

శంకరపట్నం: మండలంలోని అర్కండ్ల వాగు లోలెవల్ బ్రిడ్జిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలకు రవాణా ప్రధాన మార్గం. అయితే వాగు ప్రవహించిన ప్రతిసారి ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. వర్షాకాలంలో ప్రవాహం ఉధృతంగా ఉన్నప్పుడు సాహసం చేసి లోలెవల్ బ్రిడ్జిపై ప్రయాణిస్తే వాహనంతో పాటు ప్రయాణికులు నీటిలో కొట్టుకుపోతుండగా స్థానిక మత్స్యకారులు, గొర్రెల కాపరులు కాపాడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అర్కండ్ల గ్రామ రైతుల వ్యవసాయభూములు వాగు అవతలి వైపు ఉండటంతో నాట్లు, కలుపు తీసే సమయాల్లో ఇబ్బందులుపడుతున్నారు. మహిళా కూలీలు ఒకరి చెయ్యి ఒకరు పట్టుకొని బ్రిడ్జి దాటుతుంటారు. గత వానాకాలంలో కలుపు తీసేందుకు వెళ్లిన కూలీలు సాయంత్రం ఇంటికి


బ్రిడ్జిని ఆనుకుని వేసిన మిషన్‌భగీరథ పైప్‌లైన్‌ను చూపుతున్న గ్రామస్తుడు

వస్తుండగా వాగులో వరద ఉధృతి పెరిగి మహిళలు కొట్టుకుపోతుండగా రైతులు కాపాడారు. ఈ సంఘటన జరిగినప్పటి నుంచి గ్రామస్తులు వాగు దాటడానికి ఆందోళన చెందుతున్నారు.

వినతుల వెల్లువ

వాగుపై బ్రిడ్జి నిర్మించాలని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, సంబంధిత అధికారులకు సర్పంచ్ అనిత, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ పలుమార్లు వినతిపత్రాలు అందించారు. కేంద్రం నిధులతో కేశవపట్నం పోలీస్‌స్టేషన్ నుంచి డబుల్‌రోడ్డు పనులు చేస్తున్నారు. వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని అధికారులు ఏడాదిగా చెబుతున్నప్పటికీ ఇప్పటివరకు నయాపైసా మంజూరు కాలేదు. మళ్లీ వర్షాకాలం మొదలైంది. వాగు ప్రవహిస్తే ఇబ్బందులు తప్పవని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

తిప్పలు పడుతున్నం



వాగు అవతలి వైపు పొలాలు ఉన్నాయి. కూలీలు బ్రిడ్జి పైనుంచి వెళ్తున్నప్పుడు అదుపు తప్పి కొట్టుకుపోతున్నారు. ఎరువులు తీసుకెళ్లేందుకు గోసపడుతున్నం. వరదలో పశువులు కొట్టుకుపోయి చనిపోతున్నా పట్టించుకుంటలేరు. వాగుపై బ్రిడ్జి నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.

– శీలం భూమయ్య, రైతు, అర్కండ్ల

అధికారులు స్పందించాలి



అర్కండ్ల వాగు లోలెవల్‌బ్రిడ్జి పక్కన మిషన్‌భగీరథ పైప్‌లైన్ వేసింద్రు. వరద ప్రవాహం ఉన్నప్పుడు ద్విచక్ర వాహనంపై వాగు దాటుతూ నీటిలో పడిపోతున్నారు. అదుపు తప్పి పడిపోయినప్పుడు బ్రిడ్జి పక్కన వేసిన పైప్‌లైన్ మధ్యలో పడి చనిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మించాలి.

– నేదురు రాజు, అర్కండ్ల

నిధులు మంజూరు

బ్రిడ్జీ నిర్మాణానికి రూ.1.50 కోట్లు పదిహేను రోజుల క్రితం మంజూరయ్యాయి. మండలంలోని మక్త క్రాస్ నుంచి వీణవంక మండలం చల్లూర్ వరకు 16 కి.మీ రోడ్డు పనులకు రూ.25కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. రూ. కోటిన్నరతో లోలెవల్‌బ్రిడ్జిపై పైపులు వేసి రోడ్డు వెడల్పు, ఎత్తు పెంచే పనులు త్వరలో చేపడుతాం.

– అమీర్‌పాషా, డీఈ, ఎన్‌హెచ్

క్లుప్తంగా

జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ

సైదాపూర్: మండలంలోని లస్మన్నపల్లి గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి గురువారం భూమిపూజ చేశారు. నూతనంగా ఏర్పడిన లస్మన్నపల్లి జీపీ భవనానికి కేంద్ర ప్రభుత్వం ఈజీఎస్ పథకం నుంచి రూ.20 లక్షల నిధులు మంజూరు కాగా పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములు, పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

207 మందికి కు.ని చికిత్స

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో గురువారం నిర్వహించిన శిబిరంలో 207 మందికి కు.ని చికిత్స చేసినట్లు వైద్యులు డాక్టర్ పి.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శిబిరంలో హుజూరాబాద్, చెల్పూర్ పీహెచ్‌సీల హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశవర్కర్లు తదితరులు ఉన్నారు.

సన్మానం


ప్రశాంత్‌ను సన్మానిస్తున్న మన్మోహన్‌రావు

గన్నేరువరం: గొల్ల కురుమ యాదవ సంఘం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన సందవేని ప్రశాంత్‌ను మాజీ జెడ్పీటీసీ, వెలమ సంఘం జిల్లా అధ్యక్షుడు జువ్వాడి మన్మోహన్‌రావు గురువారం మండలకేంద్రంలో శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు పాశం ప్రభాకర్, పాశం రవి, ముడికే రాములు, పాశం నర్సయ్య, బండి పర్శరాములు పాల్గొన్నారు.

లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రామస్వామి


పాలకవర్గాన్ని అభినందిస్తున్న సభ్యులు

జమ్మికుంట: జమ్మికుంట లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గాన్ని గౌరవ అధ్యక్షుడు పొనగంటి మల్లయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మారెపల్లి రామస్వామి, ప్రధాన కార్యదర్శులుగా మహమ్మద్ రియాజ్, మహమ్మద్ బాబా, కార్యదర్శిగా గుండారపు రాజేందర్, ఉపాధ్యక్షుడిగా నిమ్మల శంకర్, జంధ్యాల రాజేందర్, కోశాధికారిగా అమృత కోటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రచారం


పథకాలను వివరిస్తున్న జాడి బాల్‌రెడ్డి

చొప్పదండి: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను గ్రామాల్లో వివరిస్తున్నామని మహాజన్ సంపర్క్ అభియాన్ చొప్పదండి కోఆర్డినేటర్ జాడి బాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రుక్మాపూర్, చాకుంట గ్రామాల్లో గురువారం తొమ్మిదేళ్ల మోదీ పాలనలోని సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రచారం నిర్వహించారు. వివిధ రంగాల్లో నైపుణ్యం గలవారిని సంపర్క్ సే సమర్థన్ ద్వారా కలుస్తూ పథకాలను వివరిస్తున్నట్లు తెలిపారు. వెంట వీరేశం, రాములు, సురేశ్, తదితరులున్నారు.

ఉపాధి కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న తిరుపతి

గంగాధర: రాష్ట్రం ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయకుండా, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను మోసం చేస్తోందని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి అన్నారు. మండల కేంద్రంలో గురువారం మండల కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి యువతను ఓటు బ్యాంకింగ్‌గా వాడుకుంటున్నారని విమర్శించారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు జి.సురేష్, నాయకులు కిరణ్,సంతోష్, మహేశ్,రాజు ఉన్నారు.

పరామర్శ

మానకొండూర్‌రూరల్: మండలంలోని జగ్గయ్యపల్లిలో బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడు గంగరాజు తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. గురువారం పార్టీ జిల్లా కార్యదర్శి రంగు భాస్కరాచారి, మండల అధ్యక్షుడు రాపాక ప్రవీణ్ గంగరాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లి సబ్‌స్టేషన్ ఆవరణలో జమ్మికుంట సబ్‌డివిజన్ పరిధిలోని జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట పరిధిలోని వినియోగదారుల కోసం విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పాటు చేశామని టీఎస్ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ వినియోదారుల ఫోరం చైర్‌పర్సన్ వేణుగోపాల్ చారి గురువారం ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా విద్యుత్ సమస్యలు ఉన్న వినియోగదారులు రాత పూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు. ఉదయం పదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈసదస్సులో మెంబర్ ఆఫ్ ఫోరం సభ్యులు తిరుమల్‌రావు, చరణ్‌దాస్, నరేందర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

బ్రాహ్మణ శంఖారావం విజయవంతం చేయండి

చొప్పదండి: నిరుపేద బ్రాహ్మణులను ఆదుకొనే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు బ్రాహ్మణ శంఖారావం పూరిస్తున్నామని చొప్పదండి బ్రాహ్మణ అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు సింహాచలం ప్రభాకరాచార్యులు తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. 23న హుజూరాబాద్‌లో రాష్ట్రంలోని పద్నాలుగు బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో జరిగే బ్రాహ్మణ శంఖారావం విజయవంతం చేయాలని కోరారు. బ్రాహ్మణులకు పెన్షన్, ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా వంటివి అమలు చేయాలన్నారు. బ్రాహ్మణులంతా హాజరవ్వాలని కోరారు. వెంట మాణవాళ చక్రపాణి, మురళీమోహన్ స్వామి, శ్రీనివాస్ శర్మ, రమేశ్ శర్మ, రవీందర్ శర్మ, తదితరులున్నారు.

కార్మికుల సమ్మెకు నాయకుల మద్దతు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు సీపీఐ నాయకులు గురువారం మద్దతు తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కిన్నెర మల్లవ్వ ఆరోపించారు. కార్మికులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పిట్ల సమ్మయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్నయాదవ్, కన్నం సదానందం, తాడవేని రవి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.


మద్దతు తెలుపుతున్న మిల్కూరి వాసుదేవరెడ్డి


శంకరపట్నంలో సీపీఐ నాయకులు

జమ్మికుంట: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఎనిమిది రోజులుగా పంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతు ప్రకటించారు. కార్మికులు, సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని డిమాండ్ చేశారు. మల్టీ పర్పస్ విధానం రద్దు చేయాలన్నారు. విధి నిర్వహణలో మృతిచెందిన కార్మికుల కుటుంబానికి రూ.పదిలక్షల నష్ట పరిహారం ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జోన్ కమిటీ సభ్యులు రాములు, వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి రవీందర్, అధ్యక్షుడు పెరుగు అశోక్, అనిత, మానస, అలీమా, రాము, సతీష్, మోహన్, రవి వివిధ గ్రామాల కార్మికులు పాల్గొన్నారు.

మానకొండూర్‌రూరల్: జీపీ సిబ్బంది సమస్యలను ప్రభుత్వం తక్షణం నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కవ్వంపల్లి సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో కవ్వంపల్లి సిబ్బంది చేస్తున్న సమ్మెకు గురువారం మద్దతు తెలిపారు. కార్మికులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, కనీస వేతనాలు రాక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్లన్నీ అధ్వానం

రామడుగు: ఇటీవల కురుస్తున్న వర్షాలతో మండలంలోని రోడ్లు బురదమయంగా తయారవుతున్నాయి. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మోతె వాగు వద్ద రామడుగుకు వెళ్లే ప్రధాన రోడ్డు, గోపాల్‌రావుపేట చౌరస్తా నుంచి గంగాధర మండలం బూరుగుపల్లి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారాయి. గ్రామస్తులు నిత్యం ఇబ్బందిపడుతూ ప్రయాణం చేస్తున్నారు. అధికారులు తక్షణం మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

నులిపురుగుల నిర్మూలనపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ తులసీదాస్

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని రైతువేదికలో ఇల్లందకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.తులసీదాస్ ఆధ్వర్యంలో ఈ నెల 20న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని గురువారం ప్రభుత్వ, ప్రైవేట్, అంగన్‌వాడీ ఉపాధ్యాయుల సమక్షంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. పద్దెనిమిదేళ్ల సంవత్సరాల వయస్సు గల వారందరికి ఆల్బేండాజోల్ మాత్రలు వేసుకునేలా చూడాలని సూచించారు. పిల్లల్లో నులిపురుగులతో పౌష్టికాహార లోపం, శక్తిహీనత, అలసట, ఏకాగ్రత లోపించటం, శారీరక ఎదుగుదల లేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయని, పిల్లల ఆరోగ్య దృష్ట్యా ఆరునెలలకోసారి అల్బెండాజోల్ మాత్రలు వేయాలని సూచించారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల, కళాశాల, గ్రామాల్లో ఉచితంగా మాత్రలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అఖిల్‌కుమార్, కమ్యూనిటీ హెల్త్ అధికారి శ్యామల, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, హెల్త్ సూపర్‌వైజర్ అనిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న డాక్టర్ తిరుపతి

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో బాల వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం జమ్మికుంట సురక్ష ఆసుపత్రి సహకారంతో ఆరోగ్య సంరక్షణపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ కన్నెబోయిన తిరుపతి మాట్లాడుతూ... వివిధ రోగాల సంక్రమణ, నివారణ చర్యల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఆహార నియమాలను తప్పనిసరిగాపాటిస్తే రోగాలు దరిచేరవన్నారు. కార్యక్రమంలో బాల వికాస సంస్థ కో ఆర్డినేటర్ జ్యోతి, సెంటర్ మేనేజర్ ఖాజాబీ, సర్పంచ్ తిరుమల, కో ఆర్డినేటర్స్ లీలావతి, మమత, రజిత తదితరులు ఉన్నారు.

ఉచిత విద్యుత్ రద్దుకు కాంగ్రెస్ కుట్ర

ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర: వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ సరిపోతుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసి వ్యాఖ్యలు గత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను గుర్తు చేస్తున్నాయని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. మండలంలోని మధురానగర్ చౌరస్తాలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. మూడు పంటలకు నీరిచ్చే బీఆర్ఎస్ కావాలో మూడు గంటలు కరెంటు ఇచ్చే కాంగ్రెస్ కావా లో, మతం పేరుతో మంటలు రేపే బీజేపీ కావా లో ప్రజలు ఆలోచించాలన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరనున్న ఎంపీటీసీ

శంకరపట్నం: మండలంలోని మెట్‌పల్లి ఎంపీటీసీ కొయ్యడ శోభారాణి కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఆమెతోపాటు పలువురు అధికార పార్టీ నాయకులు సైతం కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. 2019లో కాంగ్రెస్ చెందిన ఇద్దరు సర్పంచులు బీఆర్ఎస్‌లో చేరగా మళ్లీ కాంగ్రెస్‌లో చేరేందుకు చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన ముగించుకుని రాగానే గాంధీ భవన్‌లో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకొనున్నారు.

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం


గోపాల్‌రావుపేటలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి, నాయకులు

హుజూరాబాద్: వ్యవసాయరంగానికి సీఎం కేసీఆర్ 24 గంటల విద్యుత్ ఇస్తుంటే తప్పుడు వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక, నాయకులు కొలిపాక శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, గందె శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

శంకరపట్నం: ఉచిత విద్యుత్‌పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు నిరసిస్తూ ఆయన దిష్టిబొమ్మను తాడికల్ సబ్‌స్టేషన్ ఎదుట ఉరితీశారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, సర్పంచ్‌లు సంజీవరెడ్డి, సంపత్, నాయకులు మూల రాజయ్య, కిషన్‌రెడ్డి, మలహాల్‌రావు, సతీష్‌రెడ్డి, సంపత్, వెంకన్న, కుమార్, మొగిళి, అఫ్జల్, తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట ప్రధాన చౌరస్తాలో గురువారం గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ పాలక వర్గం ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రేవంత్‌రెడ్డి తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి, జిల్లా రైతుబంధు కమిటీ సభ్యులు వీర్ల సంజీవరావు, పార్టీ మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాడ ప్రభాకర్‌రెడ్డి, మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, నాయకులు పెరుమాండ్ల శ్రీనివాస్, నెరెల్ల అంజయ్య, పూదరి వెంకటేశ్, మీస లచ్చయ్య, అరపల్లి ప్రశాంత్, బత్తిని తిరుపతి, శనిగరపు అనిల్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, మల్లేశం, గంగయ్య, పూడురి మల్లేశం, లంక మల్లేశం,చాడ శేఖర్‌రెడ్డి పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.


శంకరపట్నం: తాడికల్‌లో..

విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట నిరసన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్: విద్యుత్‌పై కాంగ్రెస్ వైఖరి చెప్పాలని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ డిమాండ్ చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి విద్యుత్‌పై మాట్లాడిన మాటలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మానకొండూర్ మండల కేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఉరి తీశారు. మధ్యాహ్నం మహాదీక్ష నిర్వహించారు. రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని, మూడు గంటల విద్యుత్ ఇస్తామన్నా రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను సమర్థిస్తున్న కాంగ్రెస్ పార్టీని రైతు వ్యతిరేక పార్టీగానే పరిగణించాలని డిమాండ్ చేశారు. ఉచిత కరెంటు, సాగునీరు, రైతుబంధు, రైతు బీమా ఇస్తుందని తెలిపారు. రైతులకు క్షమాపణ చెప్పకపోతే రేవంత్ రెడ్డిని గ్రామాల్లో తిరగనివ్వమని మండిపడ్డారు. వెంటనే రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జెడ్పీటీసీ శేఖర్‌గౌడ్, సర్పంచులు గోపాల్‌రెడ్డి, పృథ్వీరాజ్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు తిరుపతి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ప్రభాకర్, ప్రదీప్‌రావు, యాదగిరి, మధు, మురళి పాల్గొన్నారు.

రోడ్డుపై పెట్టిన రాళ్ల తొలగింపు



శంకరపట్నం: మండలంలోని అర్కండ్ల గ్రామంలో గురువారం రోడ్డుకు అడ్డంగా రాళ్లు వేసి ప్రజలను ఓ మహిళ భయభ్రాంతులకు గురిచేసింది. గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని మహిళ రోడ్డుకు అడ్డంగా బండరాళ్లు పెట్టి రోడ్డుపై వెళ్తున్న వారిపై దాడి చేయడంతో పోలీసులకు సమాచారం అందించారు. బ్లూకోల్ట్స్ పోలీసులు రామచంద్రం, రవి గ్రామానికి చేరుకునే సరికి ఆ మహిళ ఇంటికి తాళం వేసి ఉండడంతో స్థానికులతో బండరాళ్లను తీసి వేయించారు. గతంలోనూ రెండుసార్లు ఇలాగే చేయగా కేశవపట్నం పోలీసులు చికిత్స కోసం హైదరాబాద్ ఎర్రగడ్డ ఆస్పత్రికి తరలించారు. వ్యాధి నయం కాకముందే ఆస్పత్రి నుంచి ఇంటికి రావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.